పార్శిల్ సదుపాయం కలదు
Hotel New BLUE EARTH The Pearl
Multi Cuisine Restaurant & Function Halls
ప్రతీ సాయంత్రం రుచికరమైన వెరైటీ వంటకాలతో వేడివేడిగా టిఫిన్స్ అందుబాటులో
ఫారెస్ట్ ఆఫీస్ ఎదురుగా, డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళం

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 22-4-2025
సంపుటి: 21 సంచిక: 24
పేజీలు: 8 వెల: రూ.1


(ఫొటో గూగుల్ నుంచి)

- కేజీబీవీ హాస్టల్లో విద్యార్థినుల మద్యపానం
- విచారణ ఊసు పట్టని జిల్లా అధికారి
- కాసుల కోసం బాధ్యులను వెనకేసుకొస్తున్న ఏపీసీ
- విషయం తెలిసి విజయవాడకు పిలిపించిన ఉన్నతాధికారి




## అధికారి రాజకీయ కాంక్ష

# గాడి తప్పిన సమగ్రశిక్ష!

समग्र शिक्षा
Samagra Shiksha

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉన్నప్పుడు చివరిగా ఏర్పాటైన మండలమది. రెండు మండలాల నుంచి రెండు ముక్కలు తెచ్చి కొత్త మండలంగా ఏర్పాటు చేయడం వల్ల అభివృద్ధిలో వెనుకబడిపోయిందని భావించి కేజీబీవీ పాఠశాల కూడా మంజూరు చేశారు. మండలం వెనుకబడిందా.. లేదా అన్నది పక్కన పెడితే ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థినులు కొద్ది రోజుల క్రితం బీరు, బిర్యానీలతో హాస్టల్లోనే పార్టీ చేసుకున్నారు. ఈ విషయం సమగ్రశిక్ష ఏపీసీకి, సంబంధిత జీసీడీవోకు, చివరకు సమగ్రశిక్ష సెక్రటరీ దేవానంద్‌కు తెలుసు. కానీ ఇంతవరకు కేజీబీవీ బాధ్యులపై ఎటువంటి చర్యలూ లేవు.

సమగ్రశిక్ష నిర్వహిస్తున్న కేజీబీవీల్లో విద్యార్థులకు కూరలు వండాలంటే కూరగాయలు సప్లై చేసే కాంట్రాక్ట్ ఇవ్వాలి. కిలో రూపాయికే కూరగాయలందించే వెండర్‌కు దీన్ని కట్టబెట్టారు. సాధారణంగా టెండరు ఎవరు తక్కువకు వేస్తే వారికే ఇవ్వడం ఆనవాయితీ. ఇక్కడ కూడా అలాగే ఇచ్చుంటారు. ఇందులో వ్యవస్థ తప్ప తప్ప, అధికారులు చేయడానికేమీ లేదు. అయితే కిలో కూరగాయలు రూపాయికి ఇస్తున్నారంటే వాటి నాణ్యత ఎలా ఉంటుందో సంబంధిత ఏపీసీ కనీసం ఆలోచించకపోవడమే ఇక్కడ బాధ్యతారాహిత్యాన్ని గుర్తుచేస్తుంది. నాలుగు రోజుల క్రితం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ర్యాండమ్‌గా నాలుగు కేజీబీవీలు చెక్ చేస్తే కుళ్లిపోయిన కూరగాయలు, అది కూడా విద్యార్థుల సంఖ్యకు సరిపోని క్వాంటిటీ బయటపడింది. ఇదేంటని ప్రశ్నిస్తే.. అబ్బే.. వెండర్ మంచోడే గానీ వాళ్లమ్మకు బాలేకపోవడం వల్ల ఈరోజు సరిగ్గా కూరగాయలు అందించలేకపోయాడంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేయగా ఇద్దరి మధ్య ఎలాంటి అండర్ స్టాండింగ్ ఉందో తనకు తెలుసంటూ జేసీ వ్యాఖ్యానించారు.

కట్ చేస్తే.. కేజీబీవీలకు కూరగాయలు సప్లై చేసే కాంట్రాక్ట్‌ను రద్దు చేసి టెండర్లలో రెండో స్థానంలో ఉన్న వ్యక్తికి దీన్ని కట్టబెట్టాలని జేసీ సూచించారు. విచిత్రంగా ఈ రెండో టెండరుదారు కూడా మొదటి టెండర్ దక్కించుకున్న వ్యక్తి భార్యేనని జేసీ పరిశీలనలో బయటపడింది. దీంతో మూడో వ్యక్తికి ఈ టెండరును జేసీ అప్పగించారు. అంటే.. టెండర్లు వేయించేది, ఏ రేటు కోట్ చేయాలో నిర్ణయించేది, ఎవరికి రావాలని తాపత్రయపడేది మనకు ఇట్టే అర్థమైపోతుంది. ఇక ఐఏఎస్ చదివిన అధికారికి మనం చెప్పక్కర్లేదు.

సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) రెండు రోజుల క్రితం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో శ్రీకాకుళం ఏపీసీ శశి భూషణ్ కూడా పాల్గొన్నారు. ఇక్కడ జరుగుతున్న తతంగాలపై పెద్దఎత్తునే ఆయనకు క్లాస్ తీసుకున్నారు. ఎస్పీడీది కూడా ఇదే జిల్లా కావడంతో రెండు రోజుల క్రితం ఆయన ఇక్కడకు వచ్చారు. ఆయన్ను కలిసి చల్లబరిచే పనికి ఏపీసీ శశి భూషణ్ ఎందుకు ప్రయత్నించారు? జూమ్ మీటింగ్‌లో శశిభూషణ్‌ను ఉన్న ఫళంగా విజయవాడ రమ్మని ఎందుకు ఆదేశించారు? వీటన్నింటి సమగ్ర సమాచారం తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డిగ్రీ కళాశాలలో పాఠాలు చెప్పడానికే అలిసిపోయి.. గూగుల్, అంతకు క్రితమే వివిధ ప్రచురణకర్తలు రాసిన పేరాలకు పేరాలు కాపీకొట్టి ఒక గైడ్ తయారుచేసి, దాన్ని తన సొంతమని చెబుతూ మార్కెట్‌లో పెట్టి, తాను చెప్పే పాఠాలు వినడం కంటే దాన్ని చదివితే పాస్ గ్యారెంటీ అని భరోసా ఇచ్చి ఎక్కువ శాతం రాజకీయాలకే పరిమితమైపోయిన ఒక అధ్యాపకుడు జిల్లా మొత్తం సమగ్రశిక్ష లాంటి వ్యవస్థను నడపాలంటే ముందు వ్యాపార ధోరణిని విడనాడాలి. ప్రతిచోటా 'అయితే నాకేంటి?' అన్న నినాదం వదులుకుంటేనే రాణించగలుగుతారు. ఎల్.ఎన్.పేట కేజీబీవీలో ఇంకా హైస్కూల్ దాటని విద్యార్థినులు బీరు, బిర్యానీ తెచ్చుకొని హాస్టల్‌లో పార్టీ చేసుకున్న విషయాన్ని మొదట ఆ గ్రామస్తులే గుర్తించి పేరెంట్స్ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఎస్‌వో (ప్రిన్సిపాల్)కు ఈ విషయం తెలిపారు. ఎప్పుడైతే గ్రామస్తులకు ఈ వ్యవహారం తెలిసిపోయిందో, ఇక

- మిగతా చివరి పేజీలో

నేటి సందేశం కాదు రేపటి పొద్దు జాడ
20 YEARS ANNIVERSARY
విశ్వసనీయతకు ప్రతిరూపంగా.. నిబద్ధతకు నిలువుటద్దంగా..
పరిశీలనాత్మక కథనాలకు కేరాఫ్‌గా.. సంచలన ప్రయాణంలో
'సత్యం' 20 ఏళ్లు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న శుభసందర్భంగా
'సత్యం' పత్రికకు వార్షికోత్సవ
శుభాకాంక్షలు

- మేనేజింగ్ పార్టనర్
శ్రీ సాయికృప హోమ్స్,
సాయి హైట్స్, సాయి నిర్మాణ్
(ఇంజినీర్స్ & బిల్డర్స్)
ప్లాట్ నెం. 203,
సాయి పార్వతి ప్రైడ్ అపార్ట్‌మెంట్,
న్యూకాలనీ, శ్రీకాకుళం

అధ్యక్షులు
CREDAI
SRIKAKULAM
ప్లాట్ నెం. 202,
సాయిసూర్య ఎన్‌క్లేవ్,
80 అడుగుల రోడ్డు,
శ్రీకాకుళం


పి.ఆర్.చక్రవర్తి
B.Tech (Civil)

న్యూకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి, శ్రీకాకుళం

• ఎడిటోరియల్

# విష్ణు స్వరూపాల విషాద యోగం!

శ్రీకూర్మం.. ఈ పేరు వినగానే సాక్షాత్తు శ్రీమహావిష్ణువే గుర్తుకొస్తారు. ఆయన కూర్మనాథుని అవతారంలో కొలువైన ఈ క్షేత్రం ఎంతో చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ప్రాశస్త్యం కలిగిన దివ్యక్షేత్రం. కానీ విష్ణు స్వరూపంగా భావించి పవిత్రంగా చూసుకునే కూర్మాల(తాబేళ్ల)కే దిక్కులేని పరిస్థితి దాపురించింది. కూర్మనాథుని దేవస్థానం ఆవరణలోనే అరుదైన నక్షత్ర తాబేళ్ల పార్కును నిర్వహిస్తున్నారు. ఇక్కడున్న తాబేళ్లు ఒక్కొక్కటిగా మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ దుస్థితికి అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లోపాలు రెండూ కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కులో మొత్తం 187 వరకు తాబేళ్లు ఉండగా ఇటీవలి కాలంలో 15 తాబేళ్లు మృతి చెందినట్లు చెబుతున్నారు. అలా మృతి చెందిన కొన్ని తాబేళ్లను ఆదివారం ఉదయం దేవస్థానంలో పనిచేసే ఒక వ్యక్తి శ్వేత పుష్కరిణి ఒడ్డున పడేయడాన్ని కొందరు భక్తులు చూశారు. దగ్గరికి వెళ్లి పరిశీలిస్తే ఏడు మృతి చెందిన తాబేళ్లు, మరో తొమ్మిది కాలిపోయిన స్థితిలో ఉన్న తాబేళ్లు కనిపించాయి. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. దేవస్థానం ఈవో భద్రాజీ, తాబేళ్లను సంరక్షించాల్సిన కాంట్రాక్టర్ కేవీ రమణమూర్తి కూడా శ్రీకాకుళంలోనే ఉంటారు. తాబేళ్ల మృతి విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం రెండు తాబేళ్లు మృతి చెందాయని, దానికి కారణాలు తెలుసుకుంటానని తీరిగ్గా చెప్పారు. ఇక ఈవో ఈ విషయం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దేవస్థానంలోని నక్షత్ర తాబేళ్ల సంరక్షణ బాధ్యతను 2011 నుంచి గ్రీన్‌మెర్సీ అనే స్వచ్ఛంద సంస్థ(ఎన్జీవో) దేవదాయ శాఖతో కలిసి నిర్వహిస్తోంది. గ్రీన్‌మెర్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరే శ్రీకూర్మ క్షేత్రంలోని తాబేళ్ల సంరక్షణ పార్క్ క్యూరేటర్‌గా ఉన్న కేవీ రమణమూర్తి. 2015 నాటి సమాచారం ప్రకారం.. ఆలయంలో 255 తాబేళ్లు ఉన్నాయి. వీటి సంరక్షణలో కొన్ని సమస్యలు ఉన్నాయని గ్రీన్ మెర్సీ చెబుతోంది. అయితే మృతి చెందిన తాబేళ్లను నిబంధనల ప్రకారం పోస్ట్‌మార్టం చేయకుండానే ఎందుకు దహనం చేశారనేది చర్చనీయాంశంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ తాబేళ్ల సంరక్షణ పార్కు ఉంది. అధికారులు, కాంట్రాక్టర్ నియమించిన సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. అయినా ఈ అనర్థం ఎలా జరిగిందనే దానిపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. తాబేళ్లలో భక్తులు శ్రీమహావిష్ణువును చూసుకుంటుంటారు. అందుకే ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు అక్కడి పార్కులో ఉన్న తాబేళ్లను తదేకంగా చూస్తారు. అవి మెల్లగా నడుచుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంటే చూసి ఆనందిస్తారు. నక్షత్ర తాబేళ్లు పెద్దగా పెరగవు. చిన్న సైజులోనే ఉంటాయి. ఇవి ప్రధానంగా శాకాహారులు. ఆలయ వర్గాల సమాచారం ప్రకారం భక్తులు తాబేళ్లకు గోంగూర ఆకులను ఆహారంగా సమర్పిస్తారు. ఇది కూర్మావతారానికి గౌరవంగా భావిస్తారు. సాధారణంగా నక్షత్ర తాబేళ్లు సహజ వాతావరణంలో గడ్డి, ఆకుకూరలు, పువ్వులు, రసవంతమైన మొక్కల ఆకులు, పళ్లు వంటివి తింటాయి. ఆలయంలో కూడా వీటికి ఇలాంటి శాకాహారమే (గడ్డి, ఆకుకూరలు) అందించాలి. అయితే ఆహారం సరిగ్గా అందించకపోవడం, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల అనారోగ్యంతో అవి మృత్యువాత పడుతున్నట్లు 2015లోనే ఒక నివేదికలో పేర్కొన్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ఆలయ ఉద్యోగి తెలిపారు. నక్షత్ర తాబేళ్లు సగటున 55 నుంచి 80 ఏళ్లు జీవిస్తాయి. కానీ సరైన వాతావరణం, ఆహారం, యూవీబీ లైటింగ్ లేకపోతే వాటి ఆయు:ప్రమాణం తగ్గిపోతుందని పరిశోధకులు చెబుతున్నారు. సమతుల ఆహారం, కాల్షియం, విటమిన్ డి-3 అందకపోతే తాబేళ్లలో ఎముకల పటుత్వం తగ్గిపోతుందని వన్యప్రాణి సంరక్షణ వైద్యులు చెబుతున్నారు. 80-95 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రత, యూవీబీ లైటింగ్ అవసరం. సరైన వాతావరణం లేకపోతే శ్వాసకోశ సమస్యలు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశముందంటున్నారు. తాబేళ్ల సంరక్షణకు సరైన సిబ్బంది, వేరుచేసిన ఎన్‌క్లోజర్లు లేకపోవడం వల్ల హాచ్‌లింగ్స్ (గుడ్ల నుంచి బయటకు వచ్చే తాబేలు పిల్లలను హాచ్‌లింగ్స్ అంటారు) చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లోకకల్యాణానికి విష్ణువు దాల్చిన దశావతారాల్లో కూర్మావతారం రెండోది. ఆ రూపంలోనే విష్ణుమూర్తి కొలువైన దేశంలోని ఏకైక క్షేత్రం శ్రీకూర్మం. క్షీరసాగర మథనం సమయంలో దేవతలు, రాక్షసులు అమృతం కోసం సముద్రాన్ని చిలికినప్పుడు మందర పర్వతం సముద్రంలో మునిగిపోకుండా ఉండేందుకు విష్ణువు కూర్మ (తాబేలు) రూపంలో అవతరించి పర్వతాన్ని తన వీపుపై మోశాడు. అదే కూర్మ రూపంలో వెలసిన క్షేత్రమైనందునే దీనికి శ్రీకూర్మం అనే పేరు వచ్చింది. ఆలయంలో నక్షత్ర తాబేళ్లను పెంచడం ఒక విశిష్ట ఆకర్షణ. నిర్వాహణ లోపం వల్ల ఇప్పుడు అదే మసకబారుతోంది.


## వైయస్ విగ్రహం తొలగించడం సరికాదు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతోమంది పేద ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తిని అగౌర పరిచే విధంగా అతని విగ్రహాన్ని బైరి కరజాడ జంక్షన్‌లో తొలగించడం చాలా బాధాకరమని డీసీసీ అధ్యక్షులు అంబటి క్రిష్ణారావు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగి రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను దేశంలోనే ఉన్నతమైన స్థానంలో నిలబెట్టిన వ్యక్తిని రాష్ట్ర ప్రజలు అభిమానించే వ్యక్తి విగ్రహాలు నెలకొల్పి ఉంటే వాటిని తొలగించిన పక్కన పడేయడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకుని పునః ప్రతిష్ట చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లకు ఫిర్యాదు చేస్తామన్నారు.



## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం పంచాయతీ కిష్టప్ప పేట గ్రామంలో పాఠశాలను ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని చెప్పారు. విద్యతోనే గౌరవము సంపద, కీర్తి లభిస్తుందని విద్యార్థులకు వివరించారు. గురువులను గౌరవిస్తూ ప్రణాళిక బద్దంగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో పాటించిన క్రమశిక్షణ మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని ఎమ్మెల్యే సూచించారు. గొప్ప విజయాలు సాధించిన స్వతంత్ర సమర యోధులను, ప్రముఖులను స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా జీవితంలో ఒక లక్ష్యానికి చేరుకునేలాగా నిరంతరం పట్టుదలతో కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎండిఓ, సర్పంచ్ అరసవిల్లి సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మన్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఇకపై శుక్రవారం పబ్లిక్ గ్రీవెన్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్‌ను ఇకపై ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రతి బుధవారం ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో ఉదయం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించి సాయంత్రం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసేవారమన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం ఉదయం గ్రీవెన్స్ నిర్వహించి సాయంత్రం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీనిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు.

## తిరుమలరావు మాస్టారుకు పాఠశాల కమిటీ సన్మానం

(సత్యంన్యూస్, కొత్తూరు)

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, పాత పొన్నుటూరు ఎంపీయూపీ స్కూల్‌లో సోషల్‌టీచర్‌గా పని చేస్తున్న కుదమ తిరుమలరావును ఆ పాఠశాల యాజమాన్య కమిటీ ఘనంగా సన్మానించింది. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తిరుమలరావు సేవలను కొనియాడుతూ ఈ సన్మానం నిర్వహించారు. ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ బలగ రజని మాట్లాడుతూ తిరుమలరావు నిరంతర కృషి ఎందరికో ఆదర్శమని, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతోపాటు సృజనాత్మక నైపుణ్యం పెంపొందించడం మిక్కిలి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు, ఉపాధ్యాయులు అందవరపు రాజేష్, పైసక్కి చంద్రశేఖరం, బూడిద సంతోష్ కుమార్, యిసై సౌజన్యవతి, బొమ్మాళి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ డోల చిన్నారావు, స్థానిక యువనేత ఎద్దు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు అండగా నిలుస్తాం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు అండగా నిలుస్తామని, జిల్లాలో ఎంతమంది పిల్లలున్నా, వారందరికీ ఉచితంగా రక్తాన్ని అందిస్తామని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. ఈమేరకు హిరమండలానికి చెందిన భవాని అనే చిన్నారికి ఓ నెగిటివ్ రక్తాన్ని మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో నెగిటివ్ గ్రూప్స్ చాలా తక్కువగా ఉన్నాయని, దీనిని గమనించి ఆ గ్రూపు రక్తదాతలు ముందుకు రావాలని కోరారు. దీని ద్వారా ఎంతోమంది ప్రాణాలు నిలపవచ్చున్నారు. భవానికి ప్రతి పదిహేను రోజులకి రక్తాన్ని అందించాలని, లేదంటే చిన్నారి ప్రాణాలకే ముప్పున్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుతోపాటు, నగరంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంకు, లయన్స్ బ్లడ్‌బ్యాంకు, విజయశ్రీ బ్లడ్‌బ్యాంకు, నరసన్నపేట మోక్ష బ్లడ్ బ్యాంకు, పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంకుల సహకారంతో ఈ చిన్నారికి అందుబాటులో ఉండే రక్త నిల్వల కేంద్రం ఇప్పటివరకు సహాయమందించారన్నారు. యువత ముందుకువచ్చి రక్తదానం చెయ్యాలని, రక్తదానం, అమితమైన దానమని, రక్తదానంతో ఆరోగ్యం పదిలమన్నారు. తలసీమియా చిన్నారులకు రక్తాన్ని అందించటంలో లయన్స్‌క్లబ్ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, పోలాకి గ్రామానికి చెందిన సాయి తదితరులు తమవంతు పాత్ర పోషించి చిన్నారుల ప్రాణాలు కాపాడుతుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అనంతపల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



**చిన్న వయసులోనే అద్భుత స్వరంతో మంగళంపల్లి బాలమురళీకృష్ణ, కె. విశ్వనాథ్, ఎస్పీ బాలు లాంటి మహామహులతో జూనియర్ ఆశా భోంస్లే అని అభినందనలు అందుకున్న గాయని అత్తలూరి ప్రవస్థి ఆరాధ్య సినీ నేపథ్య రాజకీయాలతో విరక్తి చెంది గుడ్‌బై చెప్పేసింది! సరిగమప జూనియర్స్, పాడుతా తీయగా, సూపర్ సింగర్స్ తదితర టైటిల్స్ కైవసం చేసుకున్న ప్రవస్థి సంయమనం కోల్పోయి తన ఆవేదన వెళ్ళబుచ్చింది! అడుగడుగునా అవమానాలు, వివక్ష, తమ వారి కోసం సీనియర్లు ఎదుటివారిని తొక్కే యడాలకు విసుగు చెంది తనే స్వస్తి పలికింది.**

# గాయని ప్రవస్థి.. సినిమా కెరీర్‌కు స్వస్తి!!

పాడుతా తీయగా సిల్వర్ జూబ్లీ పోటీల్లో పాల్గొన్న ప్రవస్థి 12వ రౌండ్‌లోనే ఎలిమినేట్ అవ్వడంతో తన కోపాన్ని ఆపుకోలేకపోయింది! ఆ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన కీరవాణి, చంద్రబోస్, సునీతలను తూర్పారబట్టింది! "పాడుతా తీయగా పోటీలలో పాల్గొనాలని కలలు కంటున్న గాయకులారా... మీకు జడ్జిలు బాగా తెలిసివుంటేనే పాల్గొనేందుకు ప్రయత్నించండి లేదంటే తొక్కేస్తారు, మీరు ఎంత బాగా పాడినా పోటీ నుంచి తరిమేస్తారు" అంటూ హెచ్చరించింది.


ఇప్పటికే తెలుగు, తమిళ్ సరిగమప ఛాంపియన్ టైటిల్‌తోపాటు పాడుతా తీయగా 11వ సీజన్ విన్నర్ అయిన ప్రవస్థి ఇవాళ చేసిన తీవ్ర ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. మాటీవీలో ప్రసారమైన సూపర్ సింగర్స్ పోటీల్లో గీతా మాధురి టీమ్‌లో ఉండి 104 డిగ్రీల జ్వరంలో సైతం "అమ్మ చూడాలి నాన్నను నిన్ను చూడాలి" అంటూ పాడిన నూటికి నూరు మార్కులు కైవసం చేసుకుని అందరినీ ఎమోషనల్‌గా ఏడిపించిన గాయని ప్రవస్థి ఇలా కట్టలు తెంచుకున్న ఆవేదనలో "సినిమా కెరీర్ వదిలేస్తున్న" అని ప్రకటించడం నిజంగా విచారకరం!

### అసలేం జరిగింది...

పాడుతా తీయగా రజతోత్సవ పోటీలకు ప్రవస్థిని కూడా ఆహ్వానించారు. ప్రవస్థి ఎంపిక సునీతకు నచ్చలేదట! ప్రవస్థిని చూసిన ప్రతిసారి ఆమె ఒక అసహ్యకర చూపు చూస్తున్నదట! ప్రవస్థి పాడేందుకు రెడీ అవుతూ మైక్ టెస్ట్ చేసుకుంటున్నప్పుడు, సునీత కీరవాణితో చెబుతున్న మాటలు ప్రవస్థి చెవిలో పడటంతో భలే బాధ కలిగిందట! ఆ అమ్మాయికి హై రేంజ్ ఉండదు, బేస్ ఉండదు అంటూ ప్రవస్థి గురించి కీరవాణికి లేనిపోని మాటలు ఎక్కించడం తనకు మింగుడు పడలేదట! అయినా దిగమింగుకుని పట్టుదలతో కసిగా "అంత రామమయం" పాట పాడిందట! అది మేల్ వాయిస్ పాట! ఆ పాట ప్రవస్థికి

పాటకు

ఇవ్వడమే అన్యాయం! ఏ జానర్‌లో అయినా ఇరగదీసే ప్రతిభ వున్న ప్రవస్థి ఆ పాటను అద్భుతంగా పాడితే, సునీత తన కామెంట్స్ లో కీరవాణికి ముందస్తుగా చెప్పిన మాటలనే రిపీట్ చేసిందట! కీరవాణి కూడా ఏదో భలే మేనేజ్ చేసావులే అని నెగటివ్ కామెంట్స్ చేశారట! ఇక లిరిక్ లో తప్పు పట్టాల్సిన చంద్రబోస్ ఏ తప్పు దొరకక "ఆర్ద్రత లేదు" అని కామెంట్ చేశారట! అదే మరో ఇద్దరు సింగర్స్ తప్పులు పాడినా అద్భుతం అని మెచ్చుకున్నారట! ఇంకో సింగర్ లోపిచ్‌లో పాడుతున్నప్పుడు రేంజ్ పెంచు అంటూ సునీత సైగ చేసి మరీ చెప్పిందట! ఇక ఎలిమినేషన్ టైంలో ఈ సన్నివేశం చూడలేమంటూ కీరవాణి, చంద్రబోస్ సీట్లలోంచి లేచి వెళ్లిపోయారట! తన ఎలిమినేషన్ ప్రకటించగానే సునీత నవ్విన విలన్ నవ్వు తన మనసును గాయం చేసిందని ప్రవస్థి ఆవేదన వ్యక్తం చేసింది. తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకుందామని అక్కడే వున్న ప్రవస్థి తల్లిగారు సునీత దగ్గరకు వెళితే "ముందు ఇక్కడ నుంచి వెళ్ళు దయచెయ్" అంటూ ఏకవచనంతో చెప్పడంతో తాను హర్ట్ అయ్యానని ప్రవస్థి అంటోంది. అవుట్ ఫిట్ విషయంలోనూ బాడీ షేమింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేసింది అత్తలూరి ప్రవస్థి ఆరాధ్య. ఇంటికి వచ్చాక బాగా ఆలోచించి ఇక సినిమా కెరీర్‌కు స్వస్తి పలకాలని, ఈ రాజకీయాలతో అలసిపోయి ఈ క్లిష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు ప్రవస్థి విడుదల చేసిన వీడియోలో తెలిపారు. "పెళ్లిళ్లలో పాడే గాయకులంటే తనకు అసహ్యం" అని కీరవాణి అనడం న్యాయమా అని ఆమె తీవ్రంగా ప్రశ్నించింది. ఆర్థిక ఇబ్బందులు వల్ల తాను వెడ్డింగ్ ఈవెంట్స్‌లో కూడా పాడతానని, అందులో తప్పేం ఉందని ప్రవస్థి ఎదురు ప్రశ్నించింది. చిత్రమ్మ, జానకమ్మ, సుశీలమ్మ అందరూ తన స్వరాన్ని మెచ్చుకున్నారని, కానీ సునీత లాంటి వాళ్ళు తనకు అవకాశాలు రాకుండా తొక్కేసారని ఆమె ఆరోపించారు. రోజూ చాలామంది తమ స్టూడియోలకు వచ్చి చాకిరీ చేసుకుంటున్నారని, అందులో అవకాశం ఇస్తానని కీరవాణి అనడం అంటే, ఆయనకు గాయకుల పట్ల ఏపాటి గౌరవం ఉందో చెప్పక్కరలేదని ప్రవస్థి



కీరవాణిని తీవ్రంగా విమర్శించింది. తనకు సినిమాల్లో పాడే అవకాశాలు ఇవ్వడం లేదని, ఇప్పుడు పాడుతా తీయగా లోను కావాలని ఎలిమినేట్ చేశారని అక్కసుతో మాట్లాడటం లేదని, ఉన్న వాస్తవాన్ని తెలియచేస్తున్న, నమ్మితే నమ్మండి లేదంటే లేదు అంటూ ప్రవస్థి స్పష్టం చేసింది! మొత్తానికి ప్రవస్థి పాట విని, కూచిపూడి నృత్యం చూసి పులకించిపోయిన దర్శకుడు విశ్వనాథ్ తనను దగ్గరకు పిలిపించుకుని ముద్దు పెట్టి ఆశీర్వదించి తన ఒడిలో కూర్చోబెట్టుకున్న చిన్నారి గాయని ప్రవస్థి ఇప్పుడు యువ గాయనిగా సినిమాల్లో పాడుతూ తనకు ఎదురయిన చేదు అనుభవాలతో మధ్యలోనే తనకు తాను సినిమా కెరీర్‌కు గుడ్‌బై చెప్పేయడం బాధాకరం, విచారకరం! కానీ, పాపం ప్రవస్థికి తెలియనిది ఏమిటంటే... సినీరంగంలో తొక్కేయడాలు కామన్! అనాదిగా వస్తున్న సంప్రదాయం! ఇలా తొక్కబడి వివక్షకు గురై నిశ్శబ్దంగా పక్కకు తప్పుకుని వేరే ఉపాధి చూసుకున్న వారు ఎందరో! కాకపోతే, ప్రవస్థకి వారికి తేడా ఒక్కటే... ధైర్యం! ప్రతిభ, ధైర్యం రెండూ టన్నుల కొద్దీ ప్రవస్థిలో ఉన్నాయి కాబట్టే ఆస్కార్ విజేత కీరవాణిని ఢీ కొట్టింది! సెహ భాష్ ప్రవస్థి!




- డా. మహ్మద్ రఫీ




స్థానిక కలెక్టర్‌బంగ్లా దరి పవిత్ర నాగావళీ నదీతీరాన వెలసియున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో మంగళవారం శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణ సందర్భంగా ప్రాతః కాలంలో శ్రీవారి సేవకులతో నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు, ఆలయ అర్చకులు బూరాడ వంశీ స్వామి ఆధ్వర్యంలో శ్రీవారు, అమ్మవార్లకు క్షీరాభిషేకం, పంచా మృతాభిషేకం, నిజరూప దర్శనము, హోమం జరిపారు. సాయంత్రం నక్షత్ర, కుంభ, నేయి, కర్పూర, నవనీత పంచహారతులు, భజన, పవళింపు సేవ నిర్వహించినట్లు ఆలయ గౌరవ అధ్యక్షులు లోకనాదం నందికేశ్వరరావు, అధ్యక్ష,కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావులు తెలిపారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

# ఘనంగా ధరిత్రి దినోత్సవం

(సత్యంన్యూస్, రాజాం)

ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మద్దువలస క్యాంపు కార్యాలయం ఆవరణలో ఉన్న కోదండ సీతారామాలయం ప్రాంగణంలో మొక్క నాటే కార్యక్రమాన్ని వికాస తరంగిణి యోగ సాధకులు, రామాలయం కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టిటివి రమణమూర్తి మాట్లాడుతూ పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక విప్లవంలా చేపట్టాలని, తద్వారా పెరుగుతున్న భూతాపాన్ని అరికట్టవచ్చునన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ప్రతి ఒక్కరూ గుడ్డ సంచుల్ని వాడాలని. ప్లాస్టిక్ వలన కలిగే అనర్ధాలను అందరికి తెలియజేయాలని చెప్పడం జరిగినది. కార్యక్రమంలో వికాస తరంగణి రాజాం శాఖ అధ్యక్షులు. వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, పెంకి చైతన్యకుమార్, పెంకి గౌరీశ్వరరావు. ఆర్‌విజె నాయుడు. మహాదాస్యం బాబ్జి. ఆర్నిపల్లి వెంకట నాయుడు, అడవిపల్లి శ్రీనివాసరావు, పండూరి వేణుగోపాలరావు, లెంక శ్రీహరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాదరావు, నగర పంచాయతీ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.






ఆమదాలవలసలో నిత్యఅన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 448వ రోజున గుడ్ల లక్ష్మిదేవి 4వ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త బాబురావు (రిటైర్డ్ సివిల్ ఇంజనీర్, విశాఖపట్నం పోర్ట్) అన్న సమర్పణ, స్వీట్, అమృతంజన్ డబ్బా, చెప్పులు, మజ్జిగ బాటిల్ తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. – సత్యంన్యూస్, ఆమదాలవలస

# జనసేనకు మెగాఫాన్స్ ఆక్సిజన్ లాంటివారు

**– శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరాడ సర్వేశ్వరరావు**

సినీఫీల్డ్‌లో అందరి హీరోలను, వాళ్ళ అభిమానులను ఎంతో గౌరవిస్తానని, అందులో భాగంగా మెగా అభిమానులు కూడా జనసేనకు చాలా ఆక్సిజన్ లాంటివారని పలు బహిరంగ సమావేశాల్లో తమ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారని శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరాడ సర్వేశ్వరరావు అన్నారు. పెద్దపాడురోడ్‌లో గల జనసేన కార్యాలయంలో పార్టీ క్రీయాశీలక సభ్వత్వాల ఐడీ కార్డులు, పత్రాలను సీనియర్ చిరంజీవి అభిమానులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఎన్నికల్లో అభ్యర్థుల విజయాల్లో అనేక సేవలందించిన జనసేన కార్యకర్తలతో పాటు, మెగా ఫాన్స్ కృషికూడా చాలావుందని, జనసేన పార్టీకి చిరంజీవి అభిమానుల మద్దతు ఎంతో అవసరమైందన్నారు. చిరంజీవి ఫాన్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంజరాపు రాము చాలా సభ్యత్వాలు నమోదు చేశారని, ఆయన ఆధ్వర్యంలో ఫాన్స్ మెంబర్స్ అందరికీ ఐడీకార్డులు, పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మెగా ఫాన్స్ ఫౌండర్, అద్వకేటు పాలకుల శ్రీనివాసరావు, పైడి శ్రీనివాసరావు, సిద్దయ్య, సత్యన్నారాయణ, శ్రీను, శంకర్, సునీల్, గిరి, పవన్, మురళి పలువురు పాల్గొని జనసేన పార్టీ సభ్యత్వాల ఐడీకార్డులు, పత్రాలను తీసుకొన్నారు.



# 23న అమ్మవారి ఆలయ గర్భాలయ నిర్మాణ ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 23న శ్రీ విజయదుర్గా అమ్మవారి ఆలయ గర్భాలయం, యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, అర్చకులు ఆరవెల్లి ఫణికుమార్ శర్మలు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గరివిడి శ్రీ సూర్యసదనం పీఠం ప్రతినిధులు వేమకోటి సూర్యనారాయణశర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# 27 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

శ్రీశ్రీశ్రీ నీలమ్మతల్లి ఆలయ పున: ప్రతిష్ట సందర్భంగా ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు యారబాడు యూత్‌కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు రూ.600లు రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.20వేలు ఇవ్వనున్నామన్నారు. అదే విధంగా ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు ప్రోత్సాహంతోపాటు షీల్డ్‌ను బహుకరించనున్నామన్నారు. ఇతర వివరాలకు యూత్ కమిటీని సంప్రదించాలని కోరారు.

# జేఏసీ నేషనల్ చైర్మన్‌కు పిఆర్ కెప్టెన్‌గా ఉమా పాలిశెట్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జేసిఐ సెనేటర్ పాలిశెట్టి ఉమా జేఏసీ నేషనల్ చైర్మన్‌కు జాతీయ స్థాయిలో కెప్టెన్‌గా నియమితులయ్యారు. నేషనల్ చైర్మన్ అంజలిగుప్తా భాత్రకు పి ఆర్ అండ్ ప్రమోషన్స్ సౌత్‌కు జాతీయస్థాయిలో కెప్టెన్‌గా నియామకం పత్రంను ఎన్‌విసి జయకుమార్ అందజేశారు. జాతీయ స్థాయిలో జేఏసీకు ప్రమోషన్స్, ప్రమోషన్ ప్రోగ్రామ్స్, పబ్లిక్ రిలేషన్ జేఏసీకు పెంచే విధంగా పని చేయాలని నేషనల్ చైర్మన్ అంజలి గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా సేనిటర్ ఉమా మాట్లాడుతూ నేషనల్ చైర్మన్ అంజలి గుప్తాకు కృతజ్ఞతలు తెలుపుతూ తనకు అప్ప చెప్పిన బాధ్యతలు నెరవేర్చుతానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన జేఏసీ జోన్ చైర్మన్ జేఎఫ్ఎస్ వినీత్ కుమార్ జైన్‌కు, జోన్ మెంటార్, జేఎఫ్ఎస్ కేవీరావు, జోన్ అడ్వైజర్ పి.ఎం.జి. శంకర్, జోన్ ప్రెసిడెంట్ ఏ సంతోష శివకుమార్, ఐపిజెడ్‌సి పాలిశెట్టి మధు బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వీరంతా పాలిశెట్టి ఉమాకు అభినందనలు తెలియ జేస్తూ ఘనంగా సత్కరించారు. జేఏసీ జోన్ సెక్రటరీ శ్రీకాంత్ వెన్న జేఏసీ జోన్ ట్రెజరర్ కామేశ్వరరావు, విప్లవ కుమార్, హరి కుమార్, ప్రవీణ్ కుమార్, రాంకుమార్, బోర్డు మెంబర్లు, జేఏసీ మెంబర్‌లు అభినందనలు తెలిపారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జీటీరోడ్డులో ఉన్న డీసీసీబీ బ్యాంకు వద్ద వేసవి తాపం అధికంగా ఉండడంతో డీసీసీబీ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న పలువురు ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. బయటకు రావల్సి వస్తే గొడుగును ధరించాలని తెలిపారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ డి సత్యన్నారాయణ, టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టీడీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, రమణమాదిగతో పాటు జీఎం వరప్రసాద్, జగదీష్, డీజీఎంలు సత్యన్నారాయణ, సునీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలో గల బూర్జ గ్రామంలో ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ సోమవారం రాత్రి బస చేశారు. కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్ తదితరులున్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస



గత ఏడాది కాలంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన జిల్లాలో గల ప్రధాన నదులలో ఒకటైన వంశధార నది పూర్తిగా ఎండి పోయింది. దీని వలన తాగునీటికి కూడా అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

– సత్యంన్యూస్, కొత్తూరు.

# అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విధి నిర్వహణలో అందించిన సేవలే ప్రతి ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గత నెల పదవీ విరమణ చేసిన డిఎస్పీ డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎస్‌మూర్తి సోమవారం పట్టణంలో ఓ హోటల్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం అనుభవం గల పోలీసు అధికారి పదవీ విరమణ చేయడం సహజమన్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలో పలు ముఖ్యమైన కేసులలో డీఎస్పీ మూర్తి చూపిన చొరవ అభినందనీయమన్నారు. అరసవల్లి, శ్రీముఖలింగం బందోబస్తు నిబద్ధతతో బాధ్యతగా విధులు నిర్వర్తించి విజయవంతంగా నిర్వహించేందుకు మూర్తి సేవలందించారన్నారు. పోలీసు శాఖలో అందించిన సేవలే గుర్తింపు నిస్తాయని, ఆ ఘనత కొందరికే దక్కుతుందన్నారు. చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగిన గొప్ప అధికారి మూర్తి అని కొనియాడారు. రిటైర్డ్ అయినప్పటికీ అనుభవం గల సేవలు పోలీసు శాఖకు అందించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన డీఎస్పీ డి.ఎస్. ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ నా సర్వీసు కాలంలో ఎక్కువ కాలం శ్రీకాకుళం జిల్లాలో పని చేశానన్నారు. ఆ సమయంలో ప్రతి అధికారి సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి శ్రీనివాసరావు, కెవి రమణ, డీఎస్పీలు సిహెచ్, వివేకానంద్, వి.వెంకట అప్పారావు, శేషాద్రి, సిఐలు, ఎస్సైలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# తాబేళ్ల మృతి ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే



(సత్యంన్యూస్, గార)

తిరుపతిలో గోవులు మృతిచెందిన విషాద ఘటనను ప్రజలు ఇంకా మరిచిపోకముందే, ఇప్పుడు శ్రీకూర్మంలో తాబేళ్ల మరణం జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. మంగళవారం శ్రీకూర్మం ఆలయాన్ని సందర్శించిన ఆయన తాబేళ్ల మరణం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ “తిరుపతి గోవుల ఘటన ఇంకా ప్రజల మనసులో ఉందన్నారు. అలాంటి ఘటన మర్చిపోకముందే ఇక్కడ తాబేళ్ల మృతి జరుగుతోందన్నారు. ఆలయాలు మన సంస్కృతికి ప్రతీకలని, అటువంటి స్థలాల్లో ఉన్న జంతువులను కూడా రక్షించలేకపోతే, అది పాలకుల వైఫల్యమేనన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తాబేళ్ల మరణానికి బాధ్యులెవరో తెలుసుకొని, వారిపై కఠినచర్యలు తప్పక తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇటువంటి దుర్వినియోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ధర్మాన కృష్ణదాస్ వెంట పార్టీ సీనియర్ నాయకులు ఎంవీ పద్మావతి, గొండు రఘురాం, గొండు కృష్ణమూర్తి, మార్పు పృథ్వి, అంబటి శ్రీనివాస్, మూకళ్ళ తాతబాబు, బరాటం నాగేశ్వరరావు, వైవీ.శ్రీధర్, గేదెల పురుషోత్తం, పొన్నాడ రుషి తదితరులు ఉన్నారు.

# సకల జీవులకు ప్రాణాధారం భూమి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భూమాత కన్నతల్లితో సమానమని ఎన్ని జన్మలు ఎత్తినా కన్నతల్లి ఋణం తీర్చలేమన్న చందంగా భూమాతను రక్షించుకోవలిసిన అవసరం, అవశ్యకత ఎంతైనా ఉందని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కోరాడ త్రినాథస్వామి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేడీ మాట్లాడుతూ తల్లి తొమ్మిది నెలలు మోస్తే భూమి మనం పుట్టినప్పటి నుండి కడవరకు మోస్తుందన్నారు. అటువంటి భూమితో ఉన్న బంధాన్ని మరిచి విచక్షణారహితంగా మానవుడు ప్రవర్తించడం వల్ల అనేక అనర్ధాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో పుడమితల్లి ఆయుష్షును పెంచేందుకు ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జీవకోటికి ఆహారాన్ని అందించే నేలతల్లి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లేకుంటే శాంతియుత జీవనం కష్టమన్నారు. అభివృద్ధి పేరుతో మనిషి చేసే విధ్వంసానికి భూమి బలైపోతుందని, ఈ పరిస్థితి నుండి భూమాతను పరిరక్షించేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛందసంస్థలు ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 1970లో మొదటి సారిగా కలకత్తాలో భూమాత దినోత్సవ వేడుకలు జరిపారని, నాటినుండి ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని జేడీ అన్నారు. రైతులు మోతాదుకు మించి వ్యవసాయరంగంలో ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. జిల్లాలో 36,250 మట్టి నమూనాలు సేకరిస్తున్నామని భూసార పరీక్షలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తులు సాధించేందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా విచక్షణారహితంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారన్నారు. ముమ్మాటికీ తప్పేనన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రజలు అప్ర



మత్తమై భూతాపాన్ని కాలుష్యాన్ని పెంచే చర్యలను నిలువరించకపోతే భూమిని కాపాడుకోవడం ఎంతో కష్టమన్నారు. అందుకే భూమి పరిరక్షణ కోసం ఇటువంటి దినోత్సవాలు జరుపుకొని అందరకీ అవగాహన కల్పించడం మన కర్తవ్యమన్నారు. అనంతరం పర్యావరణ హితాన్ని కాంక్షించి విరివిగా మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న జామి చంద్రశేఖర్, జై శ్రీరామ్‌లను సత్కరించారు. స్టార్ వాకర్స్‌క్లబ్ కో–ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, బివి రవిశంకర్, డాక్టర్ జి ఎన్ రావు, గుడ్ల జగ్గారావు, గేదెల లక్ష్మీ, జీ. వాసుదేవరావు, ఎస్. సంజీవరావు, నందిగామ కామేశ్వర రావు,గీత, శాంతి,జ్యోతి, మల్లిబాబు, మోహన్, గోలీ, ఉమా మహేశ్వరరావు, సంతోష్... మామిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## ఓబీసీపై పార్లమెంట్‌లో ప్రస్తావించండి

**- ఎంపీ శ్రీభరత్‌ను కోరిన శిష్టకరణ నేతలు -**



**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**

శిష్టకరణాలను ఓబీసీ చేర్చే విషయమై పార్లమెంటులో ప్రస్తావించాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్‌ను ఆ సంఘ నేతలు కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని తప్పకుండా గుర్తిస్తూ ప్రాధాన్యత క్రమంలో వారికే నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తుందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని విశాఖ ఎంపీ శ్రీభరత్ స్పష్టం చేశారు. విశాఖలోని ఎంపీ కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్న అనేకమందిని గుర్తించినట్టు పేర్కొన్నారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చే విషయమై పార్లమెంటులో ప్రస్తావించాల్సిందిగా రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘ వైస్ ప్రెసిడెంట్ బలివాడ సత్యారావు, గాజువాక అసెంబ్లీ నియోజక వర్గ శిష్ఠకరణ సాధికార సమితి కన్వీనర్ ప్రతాపరావు శ్రీనివాసరావు, తూర్పు,పశ్చిమ నియోజక వర్గ కన్వీనర్లు మానాపురమ్ తిలక్ పట్నాయక్, రాష్ట్ర శిష్ఠకరణ సంక్షేమ సంఘం కోశాధికారి బెహరా రాధకుమారి, దాదిరావ్ వరప్రసాద్, శిష్ఠకరణ పెద్దలు పాల్గొని సమైక్యాంధ్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్ఠ సంక్షేమ సంఘం అధ్యక్షులు అక్కుమహంతి నాగేశ్వరరావు (రాజా)కి శిష్ఠకరణ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ సంఘం నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## లారీ ఢీకొనే విగ్రహం పడిపోయింది

**- విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివేకానంద -**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)**

రూరల్ మండలంలోని భైరి జంక్షన్ వద్ద లారీ వెనుకకు తీస్తుండగా జంక్షన్‌లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం అయిందని డీఎస్పీ వివేకానంద తెలిపారు. మంగళవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళంలో సోమవారం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదని డీఎస్పీ తెలిపారు. నరసన్నపేట నుంచి రైస్ తీసుకొని భైరి జంక్షన్‌లోని గంగమ్మ మోడ్రన్ రైస్ మిల్లుకు తీసుకు వెళ్తున్నప్పుడు లారీ బ్యాక్ చేస్తుండగా విగ్రహానికి లారీ వెనుక నుంచి ఢీకొందని, దీంతో వైఎస్ విగ్రహం ధ్వంసమైందని డ్రైవర్ తెలిపారని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని లారీ డ్రైవర్ మిల్లు యజమాని, లారీ యజమానికి తెలిపారని, వారు పరిశీలించి కొత్తది ఏర్పాటుచేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. అయితే కొందరు ఎవరో దుండగులు కూల్చేశారని సోషల్ మీడియాల్లో పెట్టడంతో, ఈ వార్తలు వైరల్ అయ్యాయని, కేవలం లారీ భైరి జంక్షన్ వద్ద యుటర్న్ చేస్తుండగా విగ్రహం పడిపోయిందని, ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని వెల్లడించారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించామని డీఎస్పీ వివరించారు. తప్పుడు సమాచారాన్ని ఎవరైనా ప్రచారం చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ పైడపునాయుడు, రూరల్ ఎస్సై రాము ఉన్నారు.

## వృత్తివిద్యలో నైపుణ్యాలను సాధించాలి




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వృత్తివిద్యా కోర్సులు నైపుణ్యాలు నేర్పడానికి రూపొందించబడ్డాయని, విద్యార్థులందరూ వృత్తివిద్యా కోర్సుల్లో చేరి మంచి నైపుణ్యాలను సాధించి అత్యుత్తమ కెరీర్ సాధించాలని జిల్లా వృత్తివిద్యా శిక్షణ ఇన్చార్జి సింహాద్రి నీరజ సూచించారు. స్థానిక అంధవరపు వరహా నరసింహం మునిసిపల్ హైస్కూల్లో వృత్తివిద్యా శిక్షణలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన పదో తరగతి విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఇందిరామణి, ఒకేషనల్ ఉపాధ్యాయులు పి.నీలకంఠం, షర్మిల, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వి.సంధ్యారాణి, సభ్యులు వి.దాసు, టి.సౌజన్య, కె.తులసి, కె.శారద, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారి రాజకీయ కాంక్ష.. గాడి తప్పిన సమగ్ర శిక్ష!

మొదటిపేజీ తరువాయి

బయటపెట్టక తప్పదని భావించిన ఆమె సమగ్రశిక్ష కార్యాలయంలోని జీసీడీవో నీరజ దృష్టిలో పెట్టారు. ఆమె ఏపీసీకి ఓ మాట చెప్పి, దీనికి వివరణ అడిగారు. అంతే.. అక్కడితో ఈ కథ ముగిసిపోయింది. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ లాంటివారి దృష్టికి తీసుకువెళ్లలేదు.

**వసూళ్ల యావలో ఏపీసీ**

హాస్టల్‌లో ఉన్న అమ్మాయిలు బీరు, బిర్యానీతో పార్టీ చేసుకున్నారంటే అందులోని వారెవరో సహకరించి ఉండాలి. సోషల్ మీడియా ప్రభావం వల్లో.. చిన్న వయసులో తెలియనితనం వల్లో విద్యార్థినులు ఈ పని చేసుంటారు. అయితే హాస్టల్లోనో, తరగతి గదులకు సంబంధించిన వారో బయటి నుంచి వీటిని అందించకపోతే అమ్మాయిలు నేరుగా మద్యం దుకాణానికి వెళ్లి కొనుగోలు చేసే అవకాశం ఉండదు. కానీ ఆ తెర వెనుక వ్యక్తి ఎవరన్న కోణంలో ఏపీసీ శశిభూషణ్ ఏమాత్రం ఆలోచించలేదు. దానికి కారణమేంటంటే కేజీబీవీ ఎస్వోల నుంచి ఎప్పటికప్పుడు మామూళ్లు వసూలవుతుంటాయి. దీనికి మధ్యవర్తిగా జీసీడీవో వ్యవహరిస్తుంటారు. సదరు జీసీడీవోను రిలీవ్ చేస్తూ గతంలోనే అప్పటి కలెక్టర్ ఆర్డర్స్ ఇచ్చినా.. ఏపీసీలు, ప్రభుత్వాలు మారినా ఆమెను మాత్రం ఇప్పటికీ రిలీవ్ చేయలేదు. అంటే ఏపీసీలకు జీసీడీవో ఏమేరకు సంధానకర్తగా వ్యవరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏపీసీ ఇచ్చిన సంజాయిషీ నోటీసుకు సంబంధిత ఎస్వో ఏం సమాధానమిచ్చారో పక్కనపెడితే, ఇదే విషయాన్ని సమగ్రశిక్ష సెక్రటరీ దేవానందరెడ్డి దృష్టిలో పెట్టారు. కానీ జిల్లా కలెక్టర్‌కు ఈ విషయం తెలియదు. తొమ్మిది మంది విద్యార్థినులు కాదు.. కేవలం నలుగురు మాత్రమే ఇటువంటి పనికి పూనుకున్నారనేది ఎస్వో వివరణ సారాంశమట. ఒకరు చేసినా, నలుగురు చేసినా అది హాస్టల్ గదిలో జరిగింది కనుక తప్పిదమే. దీనిపైన ఏపీసీ చర్యలు తీసుకోలేదు.

**అధ్యాపకులు తప్ప అడ్మినిస్ట్రేటర్లు ఏరీ?**

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ స్థాయి అధికారి కేజీబీవీని తనిఖీ చేసినప్పుడు అవకతవకలు బయటపడితే సాధారణంగా మరొక జిల్లాస్థాయి అధికారి అయితే దీన్ని సరిచేస్తానని, భవిష్యత్తులో జరగకుండా చూస్తానని సంజాయిషీ ఇచ్చుకుంటారు. కానీ నిలువెల్లా రాజకీయం వంటబట్టించుకున్న శశిభూషణ్ మాత్రం రూపాయికి కుళ్లిపోయిన కూరగాయలు సప్లై చేసిన వెండర్‌ను వెనకేసుకొచ్చారు. అంటే.. ఆ రూపాయిలో కూడా పావలా ఎవరిదో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా సమగ్రశిక్ష స్టేట్‌ప్రాజెక్ట్ డైరెక్టర్ చూసీచూడనట్లు ఎమికబుల్‌గా ఉంటారు. కానీ ఆయనే శశిభూషణ్‌ను ఉన్న ఫళంగా విజయవాడ వచ్చి తనతో మాట్లాడాలని చెప్పారు. తనకు సోమవారం గ్రీవెన్స్ ఉందని, రాలేనని చెబితే.. అక్కడికి వేరే ఆఫీసర్‌ను పంపి విజయవాడ రావాల్సిందేనని ఖరాకండీగా చెప్పారు. ఇచ్ఛాపురం నగరానికి తాను స్పెషలాఫీసర్‌నని, అక్కడికి వెళ్లాలి కాబట్టి రాలేనని మరో సాకు చెబితే.. ఏ రాత్రయినా ఫర్వాలేదు, ఇచ్ఛాపురంలో రైలు దొరికితే రైలు, బస్సు దొరికితే బస్సెక్కి రావాలని ఎస్పీడీ ఆదేశించారు. కట్ చేస్తే.. ఆయన ఆగమేఘాల మీద విజయవాడ వెళ్లారు. అక్కడ ఏం జరిగిందనేది ఇంకా తెలియదు. సమగ్రశిక్ష లాంటి అతి పెద్ద వ్యవస్థలో అధ్యాపకులు, డీఈవో లాంటి ఎడ్యుకేషన్‌కు సంబంధించినవారే ఇన్నాళ్లూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మధ్యలో ఒక పోలీసు అధికారి వచ్చినా సమగ్రశిక్షకు న్యాయం జరగలేదు. ఎప్పుడో బలివాడ మల్లేశ్వరరావు హయాంలో సర్వశిక్ష అభియాన్ అనే పేరు ఉన్నప్పుడు తీసుకువచ్చిన సంస్కరణలు ఆ రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యాయి. ఆతర్వాత ఇది పునరావాస కేంద్రంగానే మారింది. ఈ సంస్థ పరిధిలో విద్యాలయాలు ఉన్నమాట వాస్తవమే అయినా ఈ వ్యవస్థను నడపడానికి అధ్యాపకులే ఉండాల్సిన అవసరంలేదు. కానీ ప్రభుత్వం ఆ మేరకు ఆలోచించడంలేదు. ఒక నిఖార్సయిన అడ్మినిస్ట్రేటర్ ఉంటేగానీ సమగ్రశిక్ష గాడిలో పడదు.

**రాజకీయ ప్రవేశమే లక్ష్యం**

ప్రస్తుతం సమగ్రశిక్ష ఏపీసీగా పని చేస్తున్న శశిభూషణరావుకు రాజకీయ కాంక్ష ఎక్కువ. దీనికి తోడు.. ఆయన మిత్రుడు వేపాడ చిరంజీవిరావు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన గెలుపుకోసం శశిభూషణ్ వర్గం పని చేసింది. ఆ తర్వాత ఆయన రిఫరెన్స్‌తోనే సమగ్రశిక్షకు ఏపీసీగా వచ్చారు. అయితే ఆయనో, జిల్లా మంత్రో సిఫార్సు చేసినంత మాత్రాన సమగ్రశిక్షకు ఏపీసీగా రావడం అంత సులువుకాదు. కచ్చితంగా లక్ష్మీకటాక్షం కురిపిస్తే గానీ ఈ పోస్టు రాదు. ఇంతకు ముందు ఏపీసీగా పని చేసిన జయప్రకాష్, ఇప్పుడు శశిభూషణ్‌రావు ఓ పద్ధతి ప్రకారం ఒకరు అనకాపల్లికి మరొకరు శ్రీకాకుళానికి పోస్టింగ్ తెచ్చుకున్నప్పుడే పెద్ద మొత్తంలో సొమ్ము చేతులు మారిందని ఆరోపణలు వచ్చాయి. ఎందుకంటే.. జయప్రకాష్ వైకాపా ప్రభుత్వంలో తన సామాజికవర్గ నేతను పట్టుకొని ఈ పోస్టులో కుదురుకున్నారు. వారు చెప్పినవే చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయనకు అనకాపల్లి పోస్టింగ్ ఇచ్చారంటే కచ్చితంగా లక్ష్మీకటాక్షమే పనిచేసి ఉండాలి. ఇందులో రెండు కేసులు ఒకే రిఫరెన్స్‌తో వెళ్లడం వల్ల కొంత రాయితీ కూడా వచ్చి ఉంటుంది. ప్రైవేటు సెక్టార్‌లో అధ్యాపకుడిగా పనిచేసిన వేపాడ చిరంజీవి ఎమ్మెల్సీగా ఎన్నిక కాగా లేనిది, ప్రభుత్వ రంగంలో.. అందులోనూ జిల్లాలో మెజార్టీ సామాజికవర్గానికి చెందిన తానెందుకు ఎమ్మెల్సీ కాలేనన్న భావన ఇప్పుడు శశిభూషణ్‌లో ఉందని చెప్పుకుంటున్నారు. అందుకే ఆయన రాబోయే ఎన్నికల కోసం కూడబెట్టుకుంటున్నారని, అంతేకాకుండా పోస్టింగ్ కోసం ఇచ్చిన సొమ్మును రాబట్టుకోవడంపైనే దృష్టి సారించారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కేజీబీవీల్లో ఏం జరిగినా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ఆ మధ్య ఒక కేజీబీవీలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారు. ఇది యాదృచ్ఛికమనుకున్నా.. ఇప్పుడు వరుసగా జరుగుతున్న వ్యవహారాలు మాత్రం ఆయన నిర్లక్ష్యానికి తార్కాణం.



## బహిరంగ ప్రకటనకు ఖండన ప్రకటన

**శ్రీమతి** భోగి ఝాన్సీరాణి W/o శంకరరావు, దండివీధి, శ్రీకాకుళం టౌన్ అనే నేను తేది 03.04.2025న 'సత్యం' సాయంకాల దినపత్రికలో దండి శ్రీనివాస పద్మజాకుమార్ దేవ్ S/o సురేంద్ర దేవ్ ప్రచురించిన బహిరంగ ప్రకటనకు ఖండన ప్రకటన మూలంగా తెలియజేయునదేమనగా..!

సదరు బహిరంగ ప్రకటనలో అంశములన్నియు సత్యదూరములనియు, మరియు తన తండ్రి పేరు వజ్రహస్త దేవ్ అని పేర్కొని, తద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ఉద్దేశ్యంతో ఇచ్చినదని తెలియజేస్తూ సదరు ఆస్తి విస్తీర్ణం Ac. 0.18 Cents, Servey No. 474-19, T.S.No. 401, అరసవల్లి గ్రామం, పాత శ్రీకాకుళం వార్డు శ్రీకాకుళం టౌన్‌లో ఉన్నదనియు, సదరు ఆస్తి నాకు రిజిస్టర్డు సెటిల్‌మెంటు Doc. No. 1466/2004 Dt: 21.04.2004 ద్వారా నాకు దండి వజ్రహస్తదేవ్ వగైరాల నుండి సంక్రమించినది, తాదానిగా నా హక్కు అనుభవంలోనే ఉన్నది. ఈ దరిమిలా నాపై సదరు శ్రీనివాస పద్మజా కుమార్ దేవ్ O.S. 338/2019 వేసినారు. సదరు దావాతో పాటు I.A. 158/2019 కూడా వేసి ఇంజంక్షన్ ఆర్డర్ పొందినారు. సదరు ఆర్డర్‌పై నేను C.M.A. 8/2022 మహారాజశ్రీ శ్రీకాకుళం జిల్లా కోర్టులో దాఖలు చేయగా, సదరు కోర్టు క్రింది కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కొట్టివేసినారు. కాబట్టి ప్రస్తుతం ఇంజంక్షన్ ఆర్డర్స్ ఏవీ పెండింగ్‌లో లేవు మరియు సదరు O.S. 338/2019 మహారాజశ్రీ శ్రీకాకుళం ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని తెలియజేయడమైనది.

ఇట్లు
శ్రీమతి భోగి ఝాన్సీరాణి,
W/o శంకరరావు,
దండివీధి, శ్రీకాకుళం
సెల్: 99895 30576

తేది: 21.04.2025
శ్రీకాకుళం


## డీడీ అక్రమాలపై గుట్టుగా విచారణ

- ♦బాధితుల వాంగ్మూలం నమోదుకు నిరాకరణ
- ♦డబ్బులు తీసుకున్నట్టు ఆధారాలివ్వాలన్న అధికారి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహనరెడ్డి అక్రమాలు, అవినీతిపై కలెక్టరేట్‌లో మంగళవారం విచారణ జరిగింది. విచారణ అధికారిగా వ్యవహరించిన కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి చాంబర్‌లో విచారణను నిర్వహించారు. బాధితుల తరఫున ఈ నెల 9న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దళిత సంఘాల నాయకుడితో పాటు డీడీ విశ్వమోహన్‌రెడ్డిని విచారించారు. అయితే ఆమె విచారించిన తీరుపైనే బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులెవరికీ నోటీసులు ఇవ్వకుండా ఫిర్యాదుదారుడు తవిటయ్య ఒక్కరి వాంగ్మూలమే నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. విశ్వమోహన్ రెడ్డి అక్రమాలు, సాంఘిక సంక్షేమశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పేరుతో వసూలు తదితర ఆరోపణలపై 'సత్యం' వరుస కథనాలు ప్రచురించింది. అయినా అధికారులు స్పందించలేదు. వైకాపా ఏజెంట్‌గా విశ్వమెహన్‌రెడ్డి పని చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపణలు గుప్పించినా ఆయనపై చర్యలు తీసుకోలేదు. చివరికి దళిత సంఘాల నాయకుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విశ్వమోహన్‌రెడ్డి అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. అయితే విశ్వమోహన్ రెడ్డికి మద్దతుగా కార్యాలయం పనివేళలో కొందరు సోషల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లు కలెక్టరేట్‌లో కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ చాంబర్ బయట కాచుకొని కూర్చోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణ జరుగుతున్న అంశాన్ని తెలుసుకొని అక్కడకు వచ్చిన మీడియా ప్రతినిధులు ఫోటో తీయడానికి అవకాశం ఇవ్వాలని కోరినా విచారణ అధికారి పద్మావతి నిరాకరించారు. ఎవరినీ లోపలికి అనుమతించకుండా ఒక అటెండర్‌ను కాపలా పెట్టారు. డీడీపై కలెక్టర్‌కు దళిత సంఘాల నాయకుడు తవిటయ్య ఫిర్యాదులో పేర్కొన్న వారెవరికీ నోటీసులు జారీ చేయలేదు. విచారణకు పిలవకపోవడంపై బాధితులు అనుమానాలు



వ్యక్తం చేస్తున్నారు. తవిటయ్య పేర్కొన్న బాధితుల్లో నోటీసులు ఇవ్వకపోయినా కలెక్టరేట్‌కు వచ్చిన ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తానని చెప్పి డీడీ విశ్వమోహన్‌రెడ్డి ఏడాదిన్నర క్రితమే రూ.2.50 లక్షలు డిమాండ్ చేస్తే విడతల వారీగా రూ. 2.30 లక్షలు ఇచ్చినట్టు వివరించాడు. అవుట్ సోర్సింగ్ జాబితాలో పేరు చేర్చడానికి మరో రూ.20 వేలు డిమాండ్ చేస్తే ఇవ్వలేకపోయానని, దీంతో ప్రసాద్ పేరును జాబితా నుంచి తప్పించడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కుటుంబ సభ్యులతో కలిసి విశ్వమోహన్‌రెడ్డిని కార్యాలయంలో కలిస్తే దూషించి, దుర్భాషలాడినట్టు బాధితుడు తెలిపారు. విచారణ అధికారి లోపలికి పిలిచి వాంగ్మూలం నమోదు చేయకుండా డబ్బులు తీసుకున్నట్టు ఆధారాలుంటే ఇవ్వాలని సూచించినట్టు బాధితుడు వివరించారు. ఆధారాలు లేవని చెప్పడంతో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని విచారణ అధికారి సూచించి బయటకు పంపేసినట్టు బాధితుడు తెలిపాడు. డీడీ విశ్వమోహన్‌రెడ్డి విచారణకు ముందే సాంఘిక సంక్షేమశాఖలో సీనియారిటీని విస్మరించి నిర్వహించిన ఉద్యోగోన్నతుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై వార్డెన్ తారకేశ్వరరావు విచారణ అధికారి పద్మావతిని కలిసి అక్రమాలపై ఆధారాలతో సహా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే విచారణ అధికారి పద్మావతి డీడీ విశ్వమోహన్‌రెడ్డిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆధారాలు లేకుండా తననెవరూ ఏమీ చేయలేరని డీడీ విశ్వమోహన్‌రెడ్డి అన్నట్టు బాధితులు వాపోతున్నారు. దీంతో విచారణ ఏకపక్షంగానే సాగిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సీహెచ్‌ఓలుగా పని చేస్తున్నా, రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఉషారాణి ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ దరిలోని పూలే పార్కు వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను తీర్చేవరకు శాంతియుత నిరసనలు కొనసాగి



స్తామని తెలిపారు. నిరసనలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుమతి, జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ రాజీవ్, జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటేనే లక్ష్యాన్ని చేరుకోగలం




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కృషి, పట్టుదల రెండు ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం సులువవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలని అధిరోహించవచ్చన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి ఆధ్వర్యంలో యువతా మేలుకో.. జగతిని ఏలుకో అనే కార్యక్రమాన్ని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సంకల్పం మంచిదైతే విజయం తనంతటదే దరి చేరుతుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోను అవసరానికి వాడాలె తప్ప విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ప్రతిభా పురస్కారం, సేవా పురస్కారాలు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురపు తేజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా డాక్టర్లు, ఇంజనీర్లు అవుతామనే ఆలోచనతోనే చదవడం కంటే సమాజానికి ఉపయోగపడే విద్యను అభ్యసిస్తామన్నదే ప్రధానమన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ గల ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం-4 విద్యార్థులు చెన్నంశెట్టి జ్యోతి, చెన్నం యామిని, ప్రైవేట్ కళాశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దుశ్శాలువతో సత్కరించి మెమెంటో అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోకతోట సింహాచలం, ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రమౌళి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.లలిత, ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ కీర్తి భార్గవనాయుడు, మాదారపు వెంకటేష్, ఏబీవీపీ నాయకులు, పలు కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.